సాక్షి
కాకినాడ
మంగళవారం । 21 । నవంబర్ । 2023





## రూ.1,40,661 విరాళం


అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కల్లూరి భాస్కర పల్లయ్య శర్మ (హైదరాబాద్) సోమవారం రూ.1,40,661 విరాళం సమర్పించారు.



## తొలి వారం.. భక్తజన సాగరం

పవిత్ర కార్తికం.. అందునా కైలాసనాథుడైన ఆ పరమేశ్వరునికి అత్యంత ప్రీతికరమైన సోమవారం.. అది కూడా ఈ మాసంలో మొట్టమొదటిది కావడంతో శివాలయాలు భక్తజన సాగరాలే అయ్యాయి. 8లో

## డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు సోమవారం 7 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,600, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా కొనసాగుతోంది.

# రబీ గట్టెక్కేలా అడుగులు



- మెట్టలో సాగుపై ప్రభుత్వం సానుకూల చర్యలు
- సాగు నీటిని అందించాలని ఇప్పటికే నిర్ణయం
- సాగులో జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు
- నీటి ఎద్దడి రాకుండా సహకరించాలని రైతులకు విజ్ఞప్తి
- ఆర్బీకేలలో అందుబాటులో విత్తనాలు, ఎరువులు

### ప్రణాళిక ప్రకారం సాగు



రబీ సీజన్‌లో జాగ్రత్తలు పాటించి సాగునీటి ఎద్దడి రాకుండా సహకరించాలి. ఏలేరు ప్రాజెక్టు, పీబీసీలలో నీటి పరిమాణం తక్కువగా ఉన్నందున సాగునీరు అందించడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అందుకే రైతులు ప్రణాళిక ప్రకారం సాగు చేయాలి. డిసెంబర్ 31 లోపు నాట్లు వేసేలా చర్యలు తీసుకోవాలి. ఏలేరు, పీబీసీ కాలువలకు వచ్చే మార్చిలో నీటి విడుదల నిలిపివేస్తారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సాగు చేసుకోవాలి. కాలువ చివరి భూముల రైతులు వరికి బదులు అపరాలు సాగు చేసుకోవడం చాల మంచిది. 33 శాతం రాయితీతో సరఫరా చేసేందుకు అపరాల విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్బీకే )అందుబాటులో ఉంచాం. ఇప్పటికే ఆర్బీకే అవగాహనా సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. ముందస్తు సాగు, సాగునీటి వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వ్యవసాయ శాఖ అనుబంధ శాఖల సిబ్బందిని అప్రమత్తం చేశాం.

ఎస్ విజయకుమార్, వ్యవసాయ శాఖ జేడీ

| | | |
|---|---|---|
| జిల్లాలో సాగు విస్తీర్ణం | : | 1,77,030 ఎకరాలు |
| 10 మండలాల్లో గోదావరి డెల్టా విస్తీర్ణం | : | 1,24,798 ఎకరాలు |
| 6 మండలాల్లోని ఏలేరు పరిధిలో విస్తీర్ణం | : | 44250 ఎకరాలు |
| అవసరమయ్యే విత్తనాలు | : | 24386 క్వింటాళ్లు |
| రైతుల వద్ద ఉన్న విత్తనాలు | : | 18193 క్వింటాళ్లు |
| ప్రైవేటు వ్యాపారుల వద్ద విత్తనాలు | : | 4693 క్వింటాళ్లు |
| ఏపీ సీడ్స్ వద్ద విత్తనాలు | : | 1500 క్వింటాళ్లు |
| అవసరమైన ఎరువులు | : | 66753 మెట్రిక్ టన్నులు |
| సిద్ధంగా ఉన్న ఎరువులు | : | 7300 మెట్రిక్ టన్నులు |
| అందుబాటులో ఉన్నవి | : | 20942 మెట్రిక్ టన్నులు |
| ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నవి | : | 2631 మెట్రిక్ టన్నులు |



పిఠాపురం మండలం జల్లూరులో రబీ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పిఠాపురం: జిల్లాలోని మెట్ట ప్రాంతంలో రబీ సీజనులో సాగుపై అన్నదాతల బెంగ తీరింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ముందస్తు చర్యలు వీరికి ధైర్యాన్నిస్తున్నాయి. సాగునీటితోపాటు పలు అంశాలపై ఇప్పటివరకూ రైతులు మీమాంసలో ఉండేవారు. ఇటీవల ప్రభుత్వం ఈ విషయంలో చొరవ తీసుకుంది.

రైతుల్లో నెలకొన్న సందేహాలపై అధికారుల ద్వారా స్పష్టతనిచ్చింది. రబీ సాగుకు ముందడుగు వేసేలా నిర్ణయాలు తీసుకుంది. గోదావరి తూర్పు మధ్య పశ్చిమ డెల్టాల పరిధిలో 8.87 లక్షల ఎకరాల ఆయకట్టులో రబీ కోసం 91.35 టీఎంసీల సాగు నీరు అవసరం. కానీ 82.49 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. వారబంది, విధానం, క్రాస్ బండలు, డీజిల్ ఇంజిన్లతో నీటి తోడకం, ముందస్తు వరినాట్లు ద్వారా ఈమేరకు నీటి కొరతను అధిగమించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. పిఠాపురం బ్రాంచి కెనాల్(పీబీసీ) పరిధిలో 32,500 ఎకరాల్లో పూర్తి ఆయకట్టుకు సాగునీటి సరఫరా చేయనున్నారు. ఈ ఆయకట్టులో 22,260 ఎకరాల్లో వరి , 10,240 ఎకరాల్లో అపరాలు సాగుకు అధికారులు రంగం సిద్ధం చేశారు.

### అధికారులు సూచిస్తున్న రకాలు

నీటి ఎద్దడి వచ్చే అవకాశం ఉన్నందున స్వల్పకాలిక రకాలైన ఎంటీయూ 1121, ఎంటీయూ 1123, ఎంటీయూ 1153, ఎంటీయూ 1156 రకాలతో పాటు ప్రైవేటు రకాలైన ఎంటీయూ 3626 బొండాలు వంటి రకాల వరిని వేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. 135 రోజుల కాల వ్యవధి కలిగిన రకాలు వేసుకోవాలంటున్నారు. ఈనెల 30వ తేదీ లోపు ఆకుమడులు వేసుకోవాలని, డిసెంబర్ 15 వతేదీ లోపు వెదజల్లే పద్ధతిలో వేసుకోవాలని సూచిస్తున్నారు. అపరాలలో బ్లాక్‌గ్రామ్ ఎల్‌బీజీ 904, ఎల్‌బీజీ 884, పీయూ 31, టీబీజీ 129, జీబీజీ 1, టీబీజీ 104, గ్రీన్‌గ్రామ్ ఎల్‌జీజీ 460, 630, 607, 574, ఐపీఎం 2-14, టీఎం 96-2, ఐపీఎం 2-14, డబ్ల్యూజీజీ 42 మొక్కజొన్న, ప్రైయివేట్ హైబ్రీడ్ రకాలను మాత్రమే వేసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

### ఏలేరు పరిధిలో ఇలా..

ఏటా రబీ సాగు సమయానికి 20 టీఎంసీల నీరు ఉండే ఏలేరులో ప్రస్తుతం 11.31 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉంది. ఇందులో 4.50 టీఎంసీలు విశాఖ స్టీల్ ప్లాంట్‌కు విడుదల చేయాల్సి ఉంది. మిగిలిన 4.05 టీఎంసీల నీటిని అధికారులు డెడ్ స్టోరేజిగా పరిగణిస్తున్నారు. మరో 2.31 టీఎంసీల నీటిని ఏలేరు పరివాహక ప్రాంత ఆయకట్టు భూములు 53 వేల ఎకరాలలో రబీ పంటకు అంటుబాటులో ఉంచినట్లు అధికారులు చెబుతున్నారు. వీటిలో 28 వేల ఎకరాల్లో వరి, 25 వేల ఎకరాల్లో అపరాల పంటల సాగుకూ నీరు అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

### ఆకుమడుల సమయంలో జాగ్రత్తలు

సాగులోనే మెళకువలు పాటించడం ద్వారా నీటి అవసరాన్ని తగ్గించుకోవచ్చు. ఈ దిశగా నీటికొరతను అధిగమించేలా అధికారులు రైతులకు ప్రోత్సాహకర సూచలను ఇస్తున్నారు.ఈ విధానం ద్వారా ఎకరాకు ఐదు సెంట్ల నారుమడి సరిపోతుంది. ముందుగా కోత కోసిన పొలంలో మురగదమ్ము చేసి ఐదు నుంచి 10 కేజీల ఎస్ఎస్‌పీ చల్లిన తరువాత వారం రోజులు అలానే ఉంచాలి. పంటసాలు చేసిన తరువాత పై పొర తోడుకునే విధంగా ఉంచుకోవాలి. తరువాత 25 కేజీల విత్తనాలను చల్లి నీరు దింపివేయాలి.



## న్యూస్‌రీల్

### దివ్యాంగులకు సాంకేతిక విద్య లక్ష్యం

**భవిత విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసిన దొరబాబు**



దివ్యాంగ విద్యార్థులకు ట్యాబులు అందజేసిన దవులూరి దొరబాబు

సామర్లకోట: దివ్యాంగ విద్యార్థులకు సాంకేతిక విద్య అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. సోమవారం స్థానిక భవిత పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ చెవిటి-మూగ, కళ్లు లేని విద్యార్థులకు అవసరమైన లిపి ఉన్న ట్యాబ్‌లు అందజేస్తున్నామన్నారు. ఈ ట్యాబుల వినియోగంపై భవిత విద్యార్థులు శిక్షణ ఇస్తామని చెప్పారు. ప్రస్తుతం ఇళ్లలోనే పిల్లలను చూడటం కష్టంగా ఉన్న పరిస్థితుల్లో అనేక మంది దివ్యాంగ విద్యార్థులకు విద్య నేర్పుతున్న భవిత టీచర్లను దొరబాబు అభినందించారు. మేనరికాల వలన పిల్లలు దివ్యాంగత్వంతో పుట్టే అవకాశం ఉందన్నారు. భవిత పాఠశాలకు అవసరమైన సదుపాయాలు కల్పించడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 12 మంది విద్యార్థులకు రూ.4.80 విలువ కలిగిన ట్యాబ్‌లను అందజేశారు. కార్యక్రమానికి ఎంఈఓ-2 పుల్లయ్య అధ్యక్షత వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్‌చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రదేవి, ఎంఈఓ శివరామకృష్ణయ్య, భవిత టీచర్లు పాల్గొన్నారు. దూర ప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులకు రవాణా సదుపాయం కల్పించాలని భవిత టీచర్లు దొరబాబును కోరారు.

### జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఇద్దరి ఎంపిక



క్రీడాకారులకు ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న పాఠశాల హెచ్‌ఎం కళ్యాణ్ చక్రవర్తి

కిర్లంపూడి: ఈ నెల 16, 17, 18వ తేదీల్లో కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్‌లో 67వ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్‌లో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలు ఇద్దరి క్రీడాకారులు ఎంపికయ్యారు. కిర్లంపూడి మండలం కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి ఐవీఆర్ వరలక్ష్మి, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బి.గౌరీశంకర్ ఖోఖో పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి డిసెంబర్‌లో మహారాష్ట్రంలోని నాసిక్‌లో నిర్వహించే అండర్-17 ఖోఖో చాంపియన్‌షిప్ జాతీయ మీట్‌లో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, పీడీ వీఎస్ ఈ.సత్యవతిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఖోఖో సెక్రటరీ కె.పట్టాభిరామ్, ఉప అధ్యక్షుడు చదలవాడ బాబీ, వైఎంఎస్‌సీ చైర్మన్ పెంటకోట నాగబాబు, హెచ్‌ఎం ఎం.కళ్యాణ్ చక్రవర్తి, వైఎంసీ చైర్మన్ అళ్ళ రామశివ పలువురు అభినందించారు.

### ఆక్వా రైతులకు అండగా ప్రభుత్వం కృషి



జగపతినగరం పెద్ద చెరువులో చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

కిర్లంపూడి: ఆక్వా రైతులకు అండగా ప్రభుత్వ కృషి చేస్తుందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం ద్వారా 36 వేల నాణ్యమైన మేలుజాతి ఫింగర్ లింగ్ సైజ్ చేపలను జగపతినగరంలోని ఇరిగేషన్ పెద్దచెరువులో ఆయన సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఫిషరీస్ ఇన్స్పెక్టర్ రాజేంద్రరావు మాట్లాడుతూ అక్వా పంటల సాగుపై ఆసక్తి ఉన్న బీసీ మత్స్యసహకార సంఘాలకు 40 శాతం, ఎస్సీ,ఎస్టీ మత్స్యసహకార సంఘాలకు 60 శాతం రాయితీతో చేప పిల్లలను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యులు తోట గాంధీ, దోమాల గంగాధర్, రాయుడు స్వామి, రమణ, జె.సునీత, ఎం మౌనిక పలువురు ఉన్నారు.

# నలభై ఏళ్లలో యనమల చేసింది శూన్యం

**మంత్రి దాడిశెట్టి రాజా విమర్శ**



లోవ కొత్తూరులో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: నలభై సంవత్సరాల రాజకీయ జీవితంలో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు తుని నియోజకవర్గానికి ఒరగబెట్టిందేమిలేదని రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా విమర్శించారు. తుని మండలం లోవ కొత్తూరులో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించి,శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. లబ్ధిదారులకు జగనన్న ఇళ్లస్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఇదే గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వై ఏపీ జగన్ నీడ్స్ కార్యక్రమంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా జగనన్న సచివాలయ కన్వీనర్ల ఇన్‌ఛార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. యనమల తన రాజకీయ జీవితంలో నియోజకవర్గానికి చేసింది శూన్యమన్నారు. పేదలకు ఇచ్చే పింఛన్లను నిలిపివేసి ఎంతోమందిని ఇబ్బందులకు గురిచేశారన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో రూ.30 కోట్లకుపైగా దిగమింగారన్నారు. తమ ప్రభుత్వంలో కరోనా వంటి కష్టకాలాన్ని ఎదుర్కొన్నప్పటికీ లోవ దేవస్థానాన్ని రూ.15 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. అంతకు ముందు అమ్మవారి ఆదాయాన్ని ఆదాయాన్ని టీడీపీ నాయకులు, యనమల సోదరులు స్వాహా చేశారన్నారు. పేదలకు పెట్టాలన్న ఆలోచనే ఆ పార్టీ నాయకులకు ఉండదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రభుత్వంలో పేదలకు పెద్దపీట వేశారన్నారు. పేదలే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో 23వేల మందికి ఇళ్లస్థలాలు ఇచ్చామన్నారు. వేలాది ఇళ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. కాలనీలే కాదు గ్రామాలు ఏర్పడుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఈనెల 25న తుని రాజా జూనియర్ కళాశాల మైదానంలో జరిగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సామాజిక సాధికార బస్ యాత్రకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, జడ్పీటీసీ పోతల సూర్యమణి, సర్పంచ్ లంక వెంకటలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యురాలు గుర్తుర్తి పద్మ, ఎంపీడీఓ పి.రవికుమార్, తహసీల్దార్ ఎల్.శివకుమార్ పాల్గొన్నారు.

**స్కీముల పేరుతో చంద్రబాబు స్వాహా**

అధికారాన్ని అడ్డుపెట్టుకుని స్కీములు పేరుతో చంద్రబాబు నాయుడు స్కాములకు పాల్పడి ప్రజల సొమ్మును దోచుకున్నాడని రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారం ఉన్నన్నాళ్లు చంద్రబాబు ప్రజలకు ఎటువంటి ఉపకారం చేయలేదని మంత్రి పేర్కొన్నారు. జన్మభూమి కమిటీలకు, టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు అనుకూలమైన పథకాలు ప్రవేశపెట్టారన్నారు. స్కీముల్లో స్కాములకు పాల్పడి ప్రజల సొమ్ములను కుటుంబానికి, అనుకూల వ్యక్తులకు దోచిపెట్టారన్నారు.

# 'జగనన్నకు చెబుదాం' స్పందనకు 352 అర్జీలు



జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను సత్వరం పరిష్కారించాల్సిందిగా ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌరసరఫరా సేవలు, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, భూ వివాదాలకు సంబంధించి 352 అర్జీలు వచ్చాయి. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం ఇవ్వాలన్నారు. ఒకే అంశంపై మళ్లీ అర్జీలు నమోదు కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, డీఆర్వో కె శ్రీధర్ రెడ్డి, జెడ్పీ సీఈవో ఎ రమణారెడ్డి, పౌరసరఫరాల శాఖ డీఎం డి పుష్పమణి, కాకినాడ డీఎల్‌డీవో పి నారాయణమూర్తి తదితరులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

**ఈవీఎం, వీవీప్యాట్స్ భద్రతకు పటిష్ట చర్యలు: కలెక్టర్**

ఎన్నికలు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఈవీఎం, వీవీప్యాట్ గోదాము భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ వద్ద ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును సోమవారం రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపక ఇతర శాఖల అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈవీఎంల రక్షణ, భద్రకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో ఈట్ల కిషోర్, కాకినాడ పట్టణ తహసీల్దార్ పీవీ సీతాపతిరావు, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం జగన్నాధం, అగ్నిమాపక సిబ్బంది, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తులతో కిటకిటలాడిన రత్నగిరి



సత్యదేవుని ఆలయం వద్ద భక్తుల రద్దీ

**తాత్కాలికంగా ముత్తంగి సేవ నిలుపుదల**

అన్నవరం: కార్తిక సోమవారం,శుద్ధ అష్టమి పర్వదినం సందర్భంగా రత్నగిరి సత్యదేవుని ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు సత్యదేవుని సన్నిధికి తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, క్యూ లైన్లు భక్తులతో నిండిపోయాయి. సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. సుమారు 30 వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. 4,750 వరకూ స్వామివారి వ్రతాలు జరిగాయి. 40 మంది భక్తులు స్వామివారి నిత్య కల్యాణంలో రూ.1,116 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి పాల్గొన్నారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. సుమారు పది వేల మంది భక్తులకు పులిహోర, దద్దోజనం పంపిణీ చేశారు. దేవస్థానం ఈఓ కే రామచంద్రమోహన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ తట్టుకునేందుకు తెల్లవారుజాము నుంచి ఉదయం 11 గంటల వరకు రత్నగిరిపై రూ.200 టిక్కెట్‌పై ప్రత్యేక దర్శనం, రూ.300 టిక్కెట్ మీద ప్రదక్షిణ దర్శనం నిలిపివేశారు. ఉచిత దర్శనం మాత్రమే కొనసాగించారు. దిగువన యంత్రాలయంలో కూడా లోపలకు ఎవరినీ అనుమతించలేదు. ఉదయం 11 గంటల తరువాత రూ.200 దర్శనానికి భక్తులను అనుమతించారు.ముత్తంగి సేవ నిర్వహించలేదు. ప్రతీ సోమవారం ముత్తంగి సేవ, గురువారం నిజరూపుదర్శనం నిర్వహించాలని దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులిచ్చిన విషయం విధితమే. భక్తుల రద్దీ కారణంగా ఈ సేవను తాత్కాలికంగా నిలిపివేయాలని అధికారులు ఆదేశించినట్లు అర్చకులు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున శివునికి అభిషేకం చేసిన తరువాత ఎప్పటి లాగానే సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి, శంకరులకు పట్టువస్త్రాలు, స్వర్ణాభరణాలు అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

# గంగపుత్రులకు భరోసా

- లబ్ధిదారుల ఖాతాల్లోకి ఓఎన్‌జీసీ పరిహారం
- నేడు జమ చేయనున్న సీఎం జగన్
- కోనసీమ, కాకినాడ జిల్లాల్లో 23,458 మందికి మేలు
- రూ.161.86 కోట్ల మేర లబ్ధి



మత్స్యకార భరోసా వేడుకలు జయప్రదం చేయాలని ప్రజలను కోరుతున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్

తాళ్లరేవు: సముద్రంలో చేపల వేట పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న గంగపుత్రులకు పరిహారం రూపంలో భరోసా దక్కనుంది. గౌతమీ గోదావరి ముఖద్వారంలో ఓఎన్‌జీసీ డ్రెడ్జింగ్, పైప్‌లైన్ నిర్మాణ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ కారణంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో నష్టపోతున్న మత్స్యకారులకు ఆ సంస్థ ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మంగళవారం పరిహారం అందించనుంది. ఈ మేరకు తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో నిర్వహించే మత్స్యకార భరోసా కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డీబీటీ ద్వారా ఓఎన్‌జీసీ పరిహారాన్ని కూడా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు.

చమురు అన్వేషణ కార్యకలాపాల కారణంగా నష్టపోతున్న మత్స్యకారులకు నెలలో 25 రోజులకుగాను రోజుకు రూ.460 చొప్పున నెలకు రూ.11,500 మేర ఓఎన్‌జీసీ పరిహారం చెల్లించనుంది. ఈ మేరకు ప్రజాప్రతినిధులు, కలెక్టర్, మత్స్య, రెవెన్యూ అధికారుల సమక్షంలో ఓఎన్‌జీసీ అధికారులు అంగీకరించారు. మత్స్య, రెవెన్యూ శాఖల అధికారుల ద్వారా 2020 నవంబర్‌లో గ్రామ, మండల స్థాయి కమిటీలు వేసి 18 నుంచి 65 ఏళ్ల వయస్సు కలిగిన లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ విధంగా కోనసీమ, కాకినాడ జిల్లాల్లో 23,458 మందిని లబ్ధిదారులను గుర్తించారు. వీరిలో 16,408 మంది కోనసీమ, 7,050 మంది కాకినాడ జిల్లాకు చెందిన వారు ఉన్నారు. వీరికి ఇప్పటికే ప్రతి నాలుగు నెలలకోసారి రూ.107,90,68,00 చొప్పున మూడు విడతల్లో రూ.323,72,04,000 జమ చేశారు. ఇప్పుడు ఆరు నెలల కాలానికి సంబంధించి నాలుగో విడతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో రూ.161,86,02,000 నగదు జమ చేయనున్నారు.

### నేడు కోరంగిలో మత్స్యకార భరోసా వేడుకలు

తాళ్లరేవు మండలం కోరంగి దుర్గా మల్లేశ్వర ఆలయ సమీపాన మత్స్యకార భరోసా వేడుకలు మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు టీటీడీ పాలక మండలి సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఆధ్వర్యాన భారీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, రెండు జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సోమవారం నిర్వహించిన సమావేశంలో పార్టీ శ్రేణులు, ప్రజలకు ఎమ్మెల్యే పొన్నాడ విజ్ఞప్తి చేశారు.


ద్రాక్షారామ: భీమేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు


ద్రాక్షారామ: భీమేశ్వరాలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


సామర్లకోట: పంచారామ క్షేత్రంలో భీమేశ్వరునికి వేకువన తొలి పూజను తిలకించడానికి తరలి వచ్చిన భక్తులు


సామర్లకోట: భీమేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

## తొలి వారం.. భక్తజన సాగరం

పవిత్ర కార్తికం.. అందునా కైలాసనాథుడైన ఆ పరమేశ్వరునికి అత్యంత ప్రీతికరమైన సోమవారం.. అది కూడా ఈ మాసంలో మొట్టమొదటిది కావడంతో శివాలయాలు భక్తజన సాగరాలే అయ్యాయి. పావన గోదావరి పాయలు.. ఆ నదీ కాలువలు.. ఆలయ పుష్కరిణులు.. ఇతర నదీతీరాల్లో వేలాదిగా భక్తులు వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించి.. ఆ ముక్కంటిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు, లక్షబిల్వార్చనలు, ఆవునేతి వత్తులతో దీపారాధనలు ఆచరించారు. తమను చల్లగా కాపాడాలని, శుభాలనొసగాలని వేడుకున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని సుప్రసిద్ధ శైవ క్షేత్రాలైన ద్రాక్షారామ, సామర్లకోట, పిఠాపురం పాదగయ, మురమళ్ల తదితర ఆలయాలకు వేలాదిగా భక్తులు పోటెత్తారు. రాజమహేంద్రవరం వద్ద గోదావరిలో పెద్ద సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

– రామచంద్రపురం రూరల్/సామర్లకోట/పిఠాపురం/ఐ.పోలవరం/కొత్తపేట/రాజమహేంద్రవరం


రాజమహేంద్రవరం: పుష్కరాల రేవు వద్ద గోదావరి పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు. (అంతర చిత్రం) గోదావరిలో దీపాలు వదులుతున్న భక్తులు


మురమళ్ల: భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న పండితుడు


కొత్తపేట: పలివెల కొప్పేశ్వరస్వామి వారికి అర్చకుల అభిషేకం

## ఈ మేక ధర.. కేకో కేక



ఒళ్లంతా విపరీతంగా పెరిగిపోయిన ఊలుతో కనిపిస్తున్న దీనిని పొట్టేలు అనుకునేరు! ఇదో మేక.. అలాగని ఇది ఆషామాషీ మేక కాదు.. దీని రేటు వింటే కళ్లు తేలవేయడం ఖాయం. మామూలుగా మన దేశవాళీ మేక ఖరీదు మహా అయితే ఓ ఇరవై వేల రూపాయలుంటుంది. కానీ ఈ మేక రేటు ఏకంగా ఒకటిన్నర లక్షలు. 'చిగు' జాతికి చెందిన ఈ మేకలు హిమాలయ పర్వత ప్రదేశాల్లో ఉత్తర ప్రదేశ్‌కు ఉత్తరంగా, హిమాచల్ ప్రదేశ్‌కు ఈశాన్యంగా లభిస్తుంటాయి. ఎక్కువగా తెలుపు రంగులో, వంపులు తిరిగిన పెద్ద పెద్ద కొమ్ములు కలిగి, సుమారు 50 కేజీల బరువు ఉంటాయి. హిమాలయాల్లో చలి ఎక్కువగా ఉండటంతో వీటి శరీరంపై ఊలు చాలా పొడవుగా పెరుగుతుంది. దీనిని శాలువాల తయారీకి వినియోగిస్తారు. అంబాజీపేట మండలం మాచవరానికి చెందిన అడబాల వెంకటేశ్వరరావుకు పశు పోషణ అంటే ఎంతో ఇష్టం. పుంగనూరు ఆవులు, గిత్తలు, విభిన్నంగా ఉండే మేకలు, చెవుల పిల్లుల వంటి వాటిని పెంచుతూ కొన్నాళ్ల తర్వాత లాభానికి విక్రయిస్తుంటారు. ఆయన ఈ మేకను నేపాల్‌లో రూ.1.50 లక్షలకు కొనుగోలు చేశాడు. మాచవరంలో జరిగిన పార్వతీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గాలి గోపురం, ఇతర ప్రారంభోత్సవ కార్యక్రమాలకు వెంకటేశ్వరరావు వద్ద ఉన్న పుంగనూరు ఆవు, దూడను తీసుకువచ్చారు. వీటితో పాటు ఆయన ఈ 'చిగు' జాతి మేకను కూడా అక్కడకు తీసుకువచ్చారు. వింతగా ఉన్న ఈ మేకను పలువురు ఆసక్తిగా తిలకించారు.

– అంబాజీపేట


పిఠాపురం: పాదగయ క్షేత్రంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


పిఠాపురం: పాదగయ క్షేత్రం పుష్కరిణిలో భక్తుల సందడి


పిఠాపురం: పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వర స్వామికి అర్చకుల అభిషేకాలు

## ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు 30 వరకూ గడువు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం సిటీ): వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఇంటర్ పరీక్షలకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్, ఫెయిలైన ప్రైవేటు విద్యార్థులందరూ జరిమానా లేకుండా ఈ నెల 30వ తేదీలోగా ఫీజు చెల్లించవచ్చు. ప్రాంతీయ ఇంటర్మీడియెట్ బోర్డు అధికారి, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎస్‌వీఎల్ నరసింహం సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రిన్సిపాళ్లు వారి కళాశాలలో ప్రైవేటు విద్యార్థులకు సంబంధించి ఎంత మంది ఫీజు చెల్లించారు, ఎందరు చెల్లించలేదు, కారణాలేమిటనే వివరాలను తమ కార్యాలయానికి మెయిల్ ద్వారా పంపించాలని ఆదేశించారు. ఫెయిలైన విద్యార్థులందరితో ఫీజు కట్టించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంటర్ పాసైన తరువాత ఉపాధి అవకాశాలు కల్పించేందుకు హెచ్‌సీఎల్ టెక్‌బీ సంస్థ అన్ని కళాశాలల్లో అవగాహన కల్పిస్తోందని తెలిపారు. దీనిపై కూడా విద్యార్థులను ప్రిన్సిపాల్స్ ప్రోత్సహించి, ఎక్కువ మంది పేర్లు నమోదు చేయించి, వచ్చే నెలలో జరిగే పరీక్షకు సన్నద్ధం చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్‌కు, పరీక్ష రాసేందుకు ఎటువంటి ఫీజూ లేదన్నారు. వచ్చే నెలలో పరీక్ష జరిగే తేదీ త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు హెచ్‌సీఎల్ టీమ్ సభ్యుడు సాయికిరణ్‌ను 96429 73350 సెల్ నంబరులో సంప్రదించాలని నరసింహం సూచించారు.



# సత్యదేవుని భక్తులకు మెరుగైన సౌకర్యాలు

- క్యూ కంపార్ట్‌మెంట్ల స్థానంలో మళ్లీ క్యూ లైన్లు
- పశ్చిమ రాజగోపురం వద్దకే దేవస్థానం బస్సులు
- విశ్రాంతి మండపం ముందు భాగంలో వ్రతాలు, ప్రసాదం కౌంటర్లు
- నూతన ఈఓ రామచంద్ర మోహన్ చర్యలు


పశ్చిమ రాజగోపురం వద్దకు దేవస్థానం వాహనాల్లో వస్తున్న భక్తులు


కంపార్ట్‌మెంట్లకు బదులు ఏర్పాటు చేసిన క్యూ లైన్లు


రామాలయం వద్ద గల విశ్రాంతి మండపంలో సేద తీరుతున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా అన్నవరం దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారి (ఈఓ) కె.రామచంద్ర మోహన్ సోమవారం చర్యలు చేపట్టారు. సత్యదేవుని దర్శనానికి ఆదివారం వచ్చిన భక్తులు క్యూ కంపార్ట్‌మెంట్లలో చాలా ఇబ్బందులు పడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆ కంపార్ట్‌మెంట్లను తాత్కాలికంగా మూసివేశారు. వాటి పక్కనే ఉన్న క్యూ లైన్ల ద్వారా దర్శనానికి వెళ్లే విధానాన్ని పునరుద్ధరించారు. దీంతో సోమవారం ఎటువంటి తొక్కిసలాటా లేకుండానే భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

- ఇప్పటి వరకూ భక్తుల వాహనాలను సత్యగిరి జంక్షన్‌లో నిలుపు చేసి భక్తులను దించి, వాహనాలను నేరుగా సత్యగిరిపై పార్కింగ్ స్థలానికి పంపించేవారు. దీనివలన సత్యగిరి జంక్షన్ నుంచి భక్తులు ఆలయానికి నడిచి రావాల్సి వచ్చేది. దేవస్థానం బస్సులు, దేవస్థానం నడుపుతున్న ఉచిత టాటా మ్యాజిక్ వాహనాల్లో కూడా వై.జంక్షన్ వరకూ మాత్రమే భక్తులను తీసుకుని వచ్చేవారు. దీనివలన భక్తులు ఇబ్బంది పడుతున్నారని ఈఓ రామచంద్ర మోహన్ గుర్తించారు. దీంతో దేవస్థానం బస్సులు, టాటా మ్యాజిక్ వాహనాల్లో భక్తులను నేరుగా పశ్చిమ రాజగోపురం వరకూ తీసుకు రావాలని ఆదేశించారు.
- పశ్చిమ రాజగోపురం ఎదుట విశ్రాంతి షెడ్డు ముందు భాగంలో ప్రసాదం, వ్రతాల కౌంటర్ల ఏర్పాటుకు ఈఓ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకూ వీటిని షెడ్డు లోపల చివరన ఏర్పాటు చేశారు. భక్తులు అక్కడి వరకూ వెళ్లి, వ్రతాల టిక్కెట్లు, ప్రసాదం కొనుగోలు చేసేందుకు చాలా అవస్థలు పడేవారు. దీంతో వీటిని పశ్చిమ రాజగోపురం ముందు భాగంలో ఏర్పాటు చేయాలని ఈఓ ఆదేశించారు.
- విశ్రాంతి షెడ్డు ముందు భాగంలో మెరకను తొలగించాలని సూచించారు.
- రామాలయం వద్ద విశ్రాంతి షెడ్డు చుట్టూ ఉన్న ఫ్లెక్సీలను తొలగించి, అక్కడ గతంలో మాదిరిగానే భక్తులు విశ్రాంతి తీసుకునే వీలు కల్పించారు.

### భక్తుల సౌకర్యాలకే ప్రాధాన్యం



సత్యదేవుని సన్నిధిలో భక్తుల సౌకర్యాలకే ప్రాధాన్యం ఇస్తాం. భక్తులు సులభంగా స్వామివారి వ్రతాలాచరించి, దర్శనం చేసుకుని వెళ్లేలా ఏర్పాట్లు చేశాం. దేవస్థానం వాహనాల్లో భక్తులు నేరుగా పశ్చిమ రాజగోపురం వరకూ చేరుకునే వీలు కల్పించాం. క్యూ లైన్లను పాత పద్ధతిలోనే ఏర్పాటు చేశాం. ఈఓ కార్యాలయం ముందు పార్కింగ్ స్థలంలో గతంలో 20 టాయిలెట్లు ఉండేవి. వాటిని కూల్చేయడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. అక్కడ మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నాం.

– కె.రామచంద్ర మోహన్, ఈఓ, అన్నవరం దేవస్థానం




## మహిళా సమాఖ్యలు ఆదాయ వనరులు పెంచుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి

సామర్లకోట: మండల మహిళా సమాఖ్యలు ఆదాయ వనరులు పెంచుకునే విధంగా చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి అన్నారు. ఇక్కడ జరిగిన జిల్లా మహిళా సమాఖ్య సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాకినాడలో స్పందన కార్యక్రమం పూర్తి చేసుకున్న అనంతరం సోమవారం సాయంత్రం ఆమె ఈ సమావేశంలో పాల్గొన్నారు. జిల్లా మహిళా సమాఖ్య పని తీరు మరింత మెరుగు పడాలని అన్నారు. గ్రామాల్లో జీవనోపాధుల మెరుగుదలకు కృషి చేయాలని సూచించారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వైఎస్సార్ చేయూత ద్వారా మహిళలు జగనన్న పాల వెల్లువ పథకాన్ని విజయవంతం చేయాలని కోరారు. స్త్రీనిధి రికవరీ 100 శాతం ఉండాలని శ్రీరమణి స్పష్టం చేశారు. అంతకు ముందు ఉదయం నుంచి సాయంత్రం వరకూ జిల్లాలోని ప్రతి మండల సమాఖ్య పని తీరుపై వైఎస్సార్ క్రాంతి పథకం డీపీఎంలు రాయ్, వెంకటేశ్వరరావు, బాబూరావు, కేశవ్, వీవీ పద్మావతి సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఐ.కాంచన, ఉపాధ్యక్షురాలు జి.కాంతం, కార్యదర్శి జి.సంధ్యారాణి, సహాయ కార్యదర్శి సీహెచ్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి అనుమానాస్పద మృతి


ప్రమాద స్థలంలో దుర్గా ప్రసాద్ మృతదేహం

తాళ్లరేవు: కాకినాడ – యానాం రహదారిలో జార్జీపేట పంచాయతీ ఎంఎల్‌కే నగర్ వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో కొప్పాడి దుర్గా ప్రసాద్ (34) అనుమానాస్పదంగా మృతి చెందాడు. కోరంగి ఎస్సై ఎస్.రవికుమార్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. యానాం కురసాంపేట గ్రామానికి చెందిన దుర్గా ప్రసాద్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. ఎదురుగా మరో ద్విచక్ర వాహనం వస్తోంది. ఈ రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో అధిక రక్తస్రావమైన దుర్గా ప్రసాద్‌కు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దుర్గా ప్రసాద్ మృతిపై పలువురు అనుమానాలు వ్యక్తం చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవికుమార్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జగ్గంపేట:ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను తప్పించబోయి, దానిని ఢీకొన్న ప్రమాదంలో మరో మోటార్ సైక్లిస్ట్ మృతి చెందాడు. జగ్గంపేట ఏఎస్సై సుబ్బారావు కథనం ప్రకారం.. మండలంలోని గొల్లలగుంట గ్రామానికి చెందిన ఏలేటి సంతోష్‌కుమార్ (26) వివాహితుడు. జగ్గంపేటలో డిగ్రీ చదువుతున్న తన మేనకోడలిని గుర్రంపాలెం నుంచి కాలేజీకి మోటార్ సైకిల్‌పై తీసుకుని వెళ్లాడు. అక్కడి నుంచి ఇద్దరూ తిరిగి వస్తుండగా జగ్గంపేట శివారు మాట్లగుంట వద్ద సోమవారం సాయంత్రం ఎదురుగా గ్యాస్ సిలిండర్లతో వస్తున్న మోటార్ సైకిల్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తల రోడ్డుకు బలంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై సంతోష్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో అతడి మోటార్ సైకిల్‌పై వెనుక కూర్చున్న మేనకోడలు గాయపడటంతో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### వ్యక్తి ఆత్మహత్య

గండేపల్లి: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై వై.గణేష్ కుమార్ కథనం ప్రకారం.. ఢిల్లీకి చెందిన మహమ్మద్ సిద్దిక్ (25) మండలంలోని సూరంపాలెం ఇంజినీరింగ్ కళాశాలలో కాంక్రీట్ పనికి వచ్చాడు. ఈ నెల 17 రాత్రి 8 గంటల సమయంలో తన భార్యతో ఫోనులో మాట్లాడుతూ గొడవపడ్డాడు. అప్పటి నుంచీ అతడు కనిపించలేదు. సోమవారం ఉదయం సమీపంలోని బాత్‌రూము నుంచి దుర్వాసన రావడంతో తోటి కూలీలు అక్కడికి వెళ్లి చూడగా, సిద్దిక్ ఉరి వేసుకుని కనిపించాడు. వారందించిన సమాచారంతో సంఘటన స్థలాన్ని సీఐ లక్ష్మణరావు, ఎస్సై గణేష్ కుమార్ సందర్శించారు. మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## గోల్డెన్ వరల్డ్ కప్


సాయి తయారు చేసిన గోల్డెన్ వరల్డ్ కప్

పెద్దాపురం పట్టణానికి చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత, బంగారు శిల్పి తాళాబత్తుల సాయి సూక్ష్మ బంగారు వరల్డ్ కప్ తయారు చేశారు. కేవలం రెండు గంటల్లో 0.500 మిల్లీగ్రాముల బంగారంతో ఈ గోల్డెన్ వరల్డ్ కప్‌ను రూపొందించారు. ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో వరుసగా పది మ్యాచ్‌ల్లో అవలీలగా విజయం సాధించి, అభిమానుల మనసును గెలుచుకున్న టీమిండియాకు, ప్రపంచ కప్ గెలుచుకున్న ఆస్ట్రేలియా జట్టుకు అభినందనలు తెలుపుతూ ఈ బంగారు ప్రపంచ కప్ తయారు చేశానని సాయి చెప్పారు.



– పెద్దాపురం